సాక్షి
తిరుపతి
సోమవారం। 4। నవంబర్। 2024



చదువులమ్మ చెంతనే సుర

వరదయ్యపాళెం మండలం వీకేఆర్‌వై కాలనీలో ప్రభుత్వ పాఠశాల సమీపంలోనే మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. - 8లో



ఘనంగా గణపతి హోమం

తిరుపతిలోని కపిలేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. - 8లో



తిరుమలలో కూలిన వృక్షం

తిరుమల రాంబగీచా అతిథి గృహం వద్ద బారీ వృక్షం ఆదివారం అక్కడ ఉంచిన కార్లపై కూలిపోయింది. - 8లో

న్యూస్‌రీల్

శ్రీకాళహస్తీశ్వరాలయ ఈఓగా బాపిరెడ్డి బాధ్యతల స్వీకరణ



ఈఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న బాపిరెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ నూతన ఈఓగా టి.బాపిరెడ్డి ఆదివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. మొదట ఈఓ బాపిరెడ్డి కుటుంబ సమేతంగా స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. డిప్యూటీ ఈఓ కృష్ణారెడ్డి వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ పరిపాలన భవనంలో బాపిరెడ్డి శ్రీకాళహస్తీశ్వరాలయ కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన ఆలయంలోని పలు విభాగాలను పరిశీలించి, అధికారులకు తగు సూచనలు చేశారు. అన్నదాన సత్రంలో భక్తులతో కలిసి ఆయన భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు తదితరులు పాల్గొన్నారు.


కొత్త ఈఓకు సమస్యల తోరణం

శ్రీకాళహస్తి:శ్రీకాళహస్తీశ్వరాలయ ఈఓగా నూతనంగా బా ధ్యతలు స్వీకరించిన బాపిరెడ్డికి సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. గత రెండు నెలలుగా విధులు నిర్వహించిన చంద్రశేఖర్ ఆ జాద్ దేవాదాయశాఖలో ఆర్‌జేడీగా ఉంటూ శ్రీకాళహస్తి ఇన్‌ఛార్జి ఈఓగా పనిచేశారు. తనదైన శైలిలో ఆలయ పాలనను ఆయన గాడిలో పెట్టడానికి ప్రయత్నించారు. అయితే రెవెన్యూ శాఖ నుంచి శ్రీకాళహస్తీశ్వరాలయంలో నూతనంగా ఈఓగా బాధ్యతలు చేపట్టిన బాపిరెడ్డి పాత ఈఓ బాటలోనే సంస్కరణలు కొనసాగిస్తారా? లేక నూతన సంస్కరణలకు తెరతీస్తారా? అని వేచి చూడాలి. దళారులను అరికట్టడంలో చంద్రశేఖర్ ఆజాద్ సఫలీకృతమయ్యారనే చెప్పాలి. అలాగే ఉద్యోగులను క్రమశిక్షణలో పెట్టి విధి నిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరించారు. అధికార పార్టీకి కొమ్ముకాయకుండా ఎండోమెంట్ నిబంధనలు పాటి స్తూ ముందుకెళ్లారు. బాపిరెడ్డి ముందు మాస్టర్‌ప్లాన్, సెక్యూరిటీగార్డు మూడు నెలల జీతా లు, భరద్వాజ తీర్థంలో అసాంఘిక కార్యకలాపాల కట్టడి, టెండర్ల విషయంలో అధికార పార్టీ జోక్యం, దళారులు, ఆలయం చుట్టూ భక్తులను మోసం చేస్తున్న వారిపై చర్యలు తదితర సమస్యలను పరిష్కరించి ఆలయ పరిపాలనను గాడిలో పెట్టాలని భక్తులు కోరుతున్నారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల:శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండి, క్యూ శిలాతోరణం వద్దకు చేరుకుంది. శనివారం అర్ధరాత్రి వరకు 88,076 మంది స్వామివారిని దర్శించుకోగా 38,829 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.52 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. కాగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

భూమన ప్రమాణస్వీకార కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు





సభాప్రాంగణం వద్ద కోలాటం

సమరోత్సాహం!

అదే ఉత్సాహం.. అదే జోష్ వైఎస్సార్‌సీపీ కార్యకర్తల్లో కనిపించింది. ఈలలు.. చప్పట్లో సభాప్రాంగణం మార్మోగింది. 'గిరగిరా తిరుగుతోంది ఫ్యాను'.. అంటూ చేతిలో ఫ్యాను గుర్తును చూపిస్తూ కేరింతలు కొట్టడం నేతలను సైతం ఉత్సాహ పరిచింది. పోలీసుల అడ్డంకులు దాటుకుని.. కూటమి కుట్రలు ఛేదించి అతిరథ మహారథుల సమక్షంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడుగా భూమన కరుణాకరరెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమం అద్యంతం పండుగ వాతావరణంలో సాగింది.

వైఎస్సార్‌సీపీలో నయా జోష్!

- అట్టహాసంగా జిల్లా అధ్యక్షుని ప్రమాణ స్వీకారం
- వేలాదిగా తరలివచ్చిన నేతలు, కార్యకర్తలు
- ఒకే వేదికను పంచుకున్న పార్టీ అతిరథ మహారథులు
- పార్టీ ముఖ్యులందరికీ సాదర స్వాగతం పలికిన మోహిత్‌రెడ్డి
- కూటమి నేతల దాడులు, దౌర్జన్యాలు, వైఫల్యాలపై ధ్వజం
- మూడు గంటలు సాగిన సభలో అద్యంతం జై జగన్ నినాదాలు



సమావేశంలో మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతిరూరల్/ తిరుపతిఅర్బన్: వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడిగా భూమన కరుణాకరరెడ్డి ప్రమాణస్వీకార కార్యక్రమం అట్టహాసంగా సాగింది. ఆదివారం తిరుపతి రూరల్ మండలం, వేదాంతపురం పంచాయతీ పరిధిలో జరిగిన ఈ కార్యక్రమానికి తుడా మాజీ చైర్మన్, పార్టీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అధ్యక్షత వహించారు. పార్టీ ముఖ్య నేతల ప్రసంగాలు కార్యకర్తల్లో సమరోత్సాహాన్ని నింపాయి. రానున్న రోజుల్లో కార్యకర్తలకే పెద్దపీట వేస్తామని నొక్కి వక్కాణించడంతో కార్యకర్తల హర్షధ్వానాలతో సభాప్రాంగణం మార్మోగింది. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను గుర్తించుకునేలా 'గుడ్ బుక్'ను ప్రతి నియోజకవర్గంలో ఇన్‌చార్జిలు అమలు చేయాలని పలువురు చేసిన సూచనలు కూడా పార్టీ శ్రేణులను ఆకట్టుకున్నాయి. వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసినా ఓడిపోయామని కొందరు గట్టిగా కేకలు వేయగా.. మనం ఓ డింది ప్రజల చేతిలో కాదని, ఈవీఎంలతో అని నేతలు వారికి సర్ది చెప్పారు. ఐదేళ్ల తర్వాత ఎన్నికలని కూర్చో వద్దని, 2027 చివరిలో మళ్లీ సార్వత్రిక ఎన్నికలు వస్తాయని, అప్పుడు మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించాలన్న పిలుపునకు భారీ స్పందన లభించింది.

ఒకే వేదికపై అతిరథ మహారథులు

భూమన కరుణాకరరెడ్డి ప్రమాణస్వీకార కార్యక్ర మం ఒకేవేదికపైకి రావడంతో కార్యకర్తలు సంబరపడ్డారు. బయట ప్రాంతంలో ఉండడంతో కార్యక్రమానికి హాజరు కాలేకపోతున్నానని, కరుణాకరరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతూ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సందేశం పంపించారు. దాదాపు 10 వేల మందికి పైగా హాజరైనట్లు సమాచారం. వైఎస్సార్ సీపీ రీజినల్ ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సజ్జల రామకృష్ణారెడ్డి, అంబటి రాంబాబు, తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూమన అభినయ్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ సుబ్రమణ్యంరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



వైవీ సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న భూమన కరుణాకరరెడ్డి



వైఎస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న పార్టీ నేతలు

ఒక్కడిని ఓడించేందుకు..

చంద్రబాబు పుట్టిన చంద్రగిరిలో 25 ఏళ్ల పిల్లోడు మోహిత్‌రెడ్డిని ఓడించేందుకు 25 మంది ఎమ్మెల్యే స్థాయి నేతలు పోటీపడ్డారు. లోకేష్, భువనేశ్వరి ఇక్కడే తిష్టవేశారు. పులివర్తి నాని, సుధారెడ్డి, వినీల్ సభలు మీద సభలు పెట్టారు. మబ్బు రామిరెడ్డి కొడుకు పెద్దబ్బ చంద్రగిరికి వచ్చి మరీ పనిచేశాడు. దేవర మనోహర్ లాంటి వారు తన భార్య నగలను కూడా అమ్మి ఖర్చు చేశారు. పులిగోరు మురళి, జేబీ శ్రీనివాస్, మేడసాని పురుషోత్తం నాయుడు, డాలర్ దివాకర్‌రెడ్డి, రెడ్డివారి ప్రీతమ్‌రెడ్డి ఇంటింటికీ తిరిగారు. ఆల్‌వేస్ అధికార పార్టీ నేత ఎంఆర్‌సీ రెడ్డి, ఓట్లు తగ్గితే అనుమానం వస్తుందని గల్లా అరుణకుమారి, ప్రముఖ సినీనటుడు మోహన్ బాబు టీం మాతో బాగుంటూనే టీడీపీ గెలవడానికి కృషి చేశారు. వ్యాపార మాంత్రికుడు రమణ మూర్తి కూడా పనిచేశారు. - చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

కార్యకర్తలే మా బలం

భూమన కరుణాకరరెడ్డి నాయకత్వంలో జిల్లాలో పార్టీకి పూర్వ వైభవం రావడం ఖాయం. ఆయన నాయకత్వ పటిమను చూస్తూ..ఎదిగిన మాలాంటి వాళ్లకు ఆయన ఆదర్శ నాయకుడు. కార్యకర్తలే మా బలం. కార్యకర్తలను ఇబ్బందులు పెడితే చూస్తూ ఊరుకోం. చంద్రగిరి నుంచే తిరుగుబాటు ప్రారంభిందాం. - చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త

ఈవీఎంలతో ఏదో జరిగింది

వైఎస్ జగన్ పరిపాలనలో అమలు చేసినన్ని సంక్షేమ పథకాలు అమలు చేయలేదు. తిరుపతి నగరాన్ని భూమన కరుణాకరరెడ్డి ఎంతో అభివృద్ధి చేశారు. ఈవీఎంలతో ఏదో జరిగింది. దాంతోనే ఓటమి పాలయ్యాం.
-విజయానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త

పార్టీని బలోపేతం చేద్దాం

మరోసారి గ్రామ స్థాయి నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేద్దాం. కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిద్దాం. రాష్ట్ర అభివృద్ధికి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాల్సి ఉంది.
- శ్రీనివాసులు, జిల్లా పరిషత్ చైర్మన్, చిత్తూరు

నన్నెంతో గౌరవించారు

తిరుపతి కార్పొరేషన్ ఏర్పడిన తర్వాత తొలిసారిగా చైర్మన్ జనరల్ అయినప్పటికీ అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ మహిళగా తమకు చైర్మన్ అవకాశం కల్పించారు. అందుకు టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అండగా నిలిచారు. ఇప్పుడాయన వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా నియమించడం ఎంతో సంతోషంగా ఉంది.
- డాక్టర్ శిరీషా, మేయర్, తిరుపతి నగరం

అవినీతిని రాసుకోండి

భూమన కరుణాకరరెడ్డి ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకార కార్యక్రమానికి వచ్చిన అభిమానులను చూస్తుంటే మనమే అధికారంలో ఉన్నట్లుగా ఉంది. మంత్రి నారా లోకేష్ రెడ్‌బుక్‌లో వైఎస్సార్‌సీపీ నేతల పేర్లు కాకుండా టీడీపీకి చెందిన ఎమ్మెల్యేల అవినీతిని రాసుకోవాలి.
- బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త

పోలీసులంటే లెక్కలేనితనం

టీడీపీ కూటమి నేతలకు పోలీసులంటే లెక్కలేకుండా పోయింది. దీంతోనే ఇష్టారాజ్యంగా లైంగికదాడులు, హత్యలకు పాల్పడుతున్నారు. చంద్రబాబు పాలన నేరాలు...ఘోరాలతోనే గడిచిపోయేలా ఉంది.
-నూకతోటి రాజేష్, వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త

ధైర్యం నా పెట్టుబడి

నేను కార్యకర్తల మనిషిని. ధైర్యం నా పెట్టుబడి, పోరాటం నా ఊపిరి. పోరాటంలోనే పెరిగా...కార్యకర్తల కోసమే నిలబడతా.. గ్రూపులు కట్టడానికి రాలేదు. నా నాయకత్వాన్ని బలపరిచే కార్యకర్తలందరినీ ఏకతాటిపై నడిపించడానికి ఒక ముఖ్య కార్యకర్తగా మాత్రమే నన్ను జగనన్న నియమించారు. నాయకులను కలుపుకుంటూ జిల్లాకు ముఖ్యనాయకుడు పెద్దిరెడ్డి సూచనలు, సలహాలను పాటిస్తూ అందరికీ మేలు జరిగేలా చూస్తా.
-భూమన కరుణాకరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

రెడ్‌బుక్ చాప్టర్లు విడ్డూరం

విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ రెడ్‌బుక్ చాప్టర్లు చెప్పడం విడ్డూరంగా ఉంది. రాష్ట్ర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయడంలో శ్రద్ధ చూపడంలేదు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై కక్ష్య సాధించడంలో శ్రద్ధ చూపుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఇప్పటివరకు ఏమీ నెరవేర్చారనే అంశాలపై చర్చించకుండా రెడ్‌బుక్ విధానాలను ఎలా అమలు చేయాలని ఆలోచన చేయడం ఆశ్చర్యంగా ఉంది.
- మద్దిల గురుమూర్తి, ఎంపీ, తిరుపతి

ఏం చేశాం... ఇకపై ఏం చేస్తామో చెప్పండి

కూటమి సర్కార్ ఇప్పటివరకు ఏం చేసిందో చెప్పాల్సి ఉంది. అలాగే ఏం చేస్తామో ప్రజలకు వివరించాల్సి ఉంది. తల్లికి వందనం ఇచ్చా రా...? అన్నదాత సుఖీభవ అమలు చేస్తారా, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.1500 ఇస్తున్నారా...వాటిపై మాట్లాకుండా వైఎస్సార్‌సీపీపై విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదు. - ఆర్కే రోజా, మాజీ మంత్రి

ప్రజల దృష్టి మళ్లించడానికే ఆరోపణలు

ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి వైఎస్సార్‌సీపీపై పలు ఆరోపణలు చేస్తున్నారు. ప్రజల దృష్టిని మళ్లించడానికి అనవసర విషయాలను చంద్రబాబునాయుడు లేవనెత్తుతున్నారు. పిల్లను ఇచ్చిన మామకే వెన్నుపోటు పొడిచిన ఘనుడు చంద్రబాబు. ఆయన పార్టీని, ఆయన గుర్తును లాక్కొని ఈయన పెత్తనం చేస్తున్నారు. -కళత్తూరు నారాయణస్వామి, మాజీ డిప్యూటీ సీఎం

కలసికట్టుగా పనిచేద్దాం

భూమన నేతృత్వంలో అన్ని ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలు విజయం సాధించడానికి కలిసికట్టుగా పనిచేద్దాం. వైఎస్సార్ ఆశయాలకు అనుగుణంగా పార్టీని భూమన నడిపిస్తారని భావిస్తున్నాం.
- డాక్టర్ సునీల్ కుమార్, వైఎస్సార్‌సీపీ, పూతలపట్టు సమన్వయకర్త

మోసంతోనే కూటమికి అధికారం

ఈవీఎంల మోసంతోనే టీడీపీ కూటమికి అధికారం వచ్చింది. దేశంలో ఏ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టినన్ని సంక్షేమ పథకాలు అమలు చేయలేదు. ప్రజలు ఓట్లు వేశారు. అయితే ఏదో మాయ చేశారు.-కృపాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జీడీ నెల్లూరు సమన్వయకర్త



సభలో కేరింతలు పెడుతున్న యువకులు

తిరుపతి జిల్లాలోని బకింగ్‌హామ్ కాలువ గట్టు యథేచ్ఛగా ఆక్రమణకు గురవుతోంది. అధికారం తమదే.. తమకు అడ్డెవరన్న ధోరణిలో కాలువకిరువైపులా భూములను కబ్జా చేస్తున్నారు. దర్జాగా రొయ్యల సాగు చేస్తున్నారు. వెరసి.. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో రూ.650 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములు కైంకర్యమవుతున్నాయి. ఫలితంగా బకింగ్‌హామ్ కాలువ రోజురోజుకూ కుంచించుకుపోతోంది.

వాకాడు మండలంలో బకింగ్ హామ్ కెనాల్ భూములను ఆక్రమించుకుని సాగు చేస్తున్న రొయ్యల గుంతలు



కాలువ గట్టు.. కొల్లగొట్టు

- బక్కచిక్కిపోతున్న బకింగ్ హామ్ కెనాల్
- బకింగ్ హామ్‌లో ఒకప్పుడు పెద్ద ఎత్తున జల రవాణా
- అడ్డూ అదుపు లేకుండా అధికార పార్టీ నేతల ఆక్రమణలు
- తిరుపతి జిల్లాలో 155 ఎకరాలు కబ్జా
- అసైన్‌మెంట్ పట్టాల కోసం ప్రయత్నాలు
- చోద్యం చూస్తున్న, రెవెన్యూ, కెనాల్ అధికార యంత్రాంగం

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో కెనాల్ పొడవు	169 కిలోమీటర్లు
తిరుపతి జిల్లాలో కెనాల్ పొడవు	75 కిలోమీటర్లు
తిరుపతి జిల్లాలో తీర ప్రాంత మండలాలు	5

సాక్షి టాస్క్‌ఫోర్స్: రాష్ట్రంలో 796 కిలో మీటర్లు పొడవున అతి పెద్ద జల రవాణా మార్గం బకింగ్ హామ్ కెనాల్ నేడు పచ్చనేతల ఆక్రమణలతో బక్కచిక్కిపోతోంది. ఈ కాలువకిరువైపులా గట్టును తెలుగు తమ్ముళ్లు యథేచ్ఛగా ఆక్రమించుకుని రొయ్యల గుంతలు సాగు చేస్తూ ఎవరికి వారు పెద్దలుగా చెలామణి అవుతున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 12 తీర ప్రాంత మండలాలను తాకుతూ 169 కిలో మీటర్లు పొడవున బకింగ్ హామ్ కెనాల్ విస్తరించి ఉంది. అప్పట్లో ఈ కెనాల్ ద్వారా పెద్ద ఎత్తున జల రవాణా జరిగేది. కాలక్రమంలో జల రవాణాపై కేంద్ర ప్రభుత్వాలు దృష్టి సారించక పోవడంతో అది మరుగున పడి పోయింది. దీంతో కాలువపై ఉన్న లాకులు శిథిలావస్థకు చేరుకున్నాయి. అలాగే పలు ప్రాంతాల్లో కాలువపై వంతెనలు నిర్మించడం, సముద్రపు నీరు కాలువలోకి పోటు ద్వారా ప్రవహించక పోవడంతో కాలువ రూపురేఖలు మారిపోయాయి. దీన్ని ఆసరా చేసుకున్న తెలుగు తమ్ముళ్లు మరో అడుగు ముందుకు వేసి కాలువకిరువైపులా కట్టను ఆక్రమించడం మొదలెట్టారు. తిరుపతి జిల్లాలోని పలు మండలాల్లో బకింగ్ హామ్ కాలువకిరువైపులా 155 ఎకరాల వరకు ఆక్రమణలకు గురైంది. ఇందులో ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని అధికార పార్టీ నాయకుల హస్తం ఉంది. దీంతోనే గతంలో బకింగ్ హామ్ కాలువ పునరుద్ధరణ పనులు చేపట్టిన సమయంలో ఆ పనులను ఆపించేందుకు కేంద్రంలోని పెద్దల ద్వారా మంతనాలు జరిపి, పనులకు బ్రేక్ వేయించారు. దీంతో పనులు ముందుకు సాగక పోవడంతో నేటికీ తమ్ముళ్లు ఆ భూముల్లో సాగు ద్వారా ఏటా రూ.లక్షలు గడిస్తున్నారు. కొంత మంది ఏకంగా ఆక్రమించుకున్న భూములకు సంబంధించి అసెస్‌మెంట్ పట్టాలు పొందేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇదే జరిగితే భవిష్యత్తులో జల రవాణా ఒకటి జరిగేదని చరిత్రలో చదువుకోవాల్సివస్తుంది.

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 2,600 ఎకరాల వరకు..

ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని కావలి, అల్లూరు, బోగోలు, విడవలూరు, ఇందుకూరుపేట, టీపీ గూడూరు, ముత్తుకూరు, చిల్లకూరు, కోట, వాకాడు, సూళ్లూరుపేట, తడ మండలాల్లో దాదాపు 2600 ఎకరాల వరకు బకింగ్‌హామ్ కెనాల్‌కిరువైపులా ఆక్రమణలు జరిగాయి. ఈ క్రమంలోనే తిరుపతి జిల్లాలోని వాకా డు, కోట, చిల్లకూరు మండలాలకు సంబంధించి దాదాపు 155 ఎకరాల వరకు బకింగ్ హామ్ కెనాల్ భూములను అధికార పార్టీ నేతలు ఆక్రమించి, దర్జాగా అనుభవిస్తున్నారు. జిల్లా తీర ప్రాంతాల్లో పలు పరిశ్రమలు ఏర్పాటు కానుండడంతో భూముల కు మంచి గిరాకీ వచ్చింది. దీంతో ఆక్వా సాగుకు బకింగ్ హామ్ కాలువ వెంబడి ఉండే ప్రభుత్వ భూములు అనువుగా మారాయి. దీంతో వాటిపై కన్నేసిన తెలుగు తమ్ముళ్లు ఎక్కడిక్కడ ఆక్రమించుకునే పనిలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ఒక ఎకరా భూమి రూ.20, నుంచి రూ.25 లక్షలు వరకు ధర పలుకుతుంది. అంటే 2600 ఎకరాలకు సంబంధించి దాదాపు రూ.650 కోట్ల విలువ చేసే బకింగ్ హామ్ కెనాల్ ఆస్తులు పరాధీనమై ఉన్నాయి.

అగమ్యగోచరంగా కెనాల్ పరిస్థితి

కేంద్ర జల రవాణా శాఖ ఆధీనంలో ఉండాల్సిన బకింగ్‌హామ్ కెనాల్ పరిస్థితి నేడు అగమ్యగోచరంగా మారింది. ఈ కెనాల్‌ను జల రవాణాకు అనువైనదిగా అభివృద్ధి చేస్తామంటూ 2014 ఎన్నికలకు ముందు నేడు అధికారంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలకులు హామీలు ఇచ్చారు. అయితే వాటిని నేటికీ అమలు చేయక పోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నిలిచి పోయింది. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న ప్రభుత్వం మాత్రం బకింగ్ హామ్ కాలువపై ప్రత్యేక దృష్టి పెట్టి ఒకడుగు ముందుకేసి, జల రవాణా మార్గాని పునఃప్రారంభించేందుకు సర్వే మొదలు పెట్టి వేల ఎకరాల ఆక్రమణలను గుర్తించింది. దీంతో తెలుగు తమ్ముళ్లు ఉలిక్కి పడ్డారు. అంతే తమ పరపతిని ఉపయోగించుకుని అప్పట్లో కేంద్రం నుంచి వచ్చిన బృందాల సభ్యులకు పూర్తి సహకారం అందించకపోవడంతో పనులు సర్వేతోనే నిలిచి పోయాయి.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి : జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ఆకాశదీపాన్ని ఆగమోక్తంగా వెలిగించారు. కార్తీకమాసం పురస్కరించుకొని ప్రతి రోజు ఆకాశదీపాన్ని సంప్రదాయబద్ధంగా వెలిగిస్తుంటారు. ఆలయంలోని ఊంజల్‌సేవ మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్తూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. ఈఓ బాపిరెడ్డి, ఆలయ అధికారులు, వేద పండితులు పాల్గొన్నారు.



కార్తీక దీపానికి పూజలు చేస్తున్న ఈఓ బాపిరెడ్డి దంపతులు, అర్చకులు

మానవ మృగాన్ని ఉరితీయాలి



వర్సిటీ మహిళా హాస్టల్స్ వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థినులు

తిరుపతి సిటీ: వడమాలపేట ఎస్టీ కాలనీకి చెందిన మూడున్నరేళ్ల చిన్నారిని పొట్టన పెట్టుకున్న మానవ మృగాన్ని వెంటనే ఉరితీయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి ఎస్వీయూ మహిళా హాస్టల్ వద్ద విద్యార్థినులతో కలసి వారు క్యాండిల్ ర్యాలీ నిర్వహించి, నిరసన తెలిపారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు చిన్న, ఎస్వీయూ కార్యదర్శి చంద్రనాయక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటికే పదుల సంఖ్యలో చిన్నారులపై లైంగిక దాడులు జరిగినా ప్రభుత్వానికి చలనం లేకపోవడం దారుణమన్నారు. వీర మహిళలుగా జనసేన కార్యకర్తలకు పేరు పెట్టిన పవన్, మహిళలకు అండగా ఉంటానంటూ ప్రగల్భాలు పలికిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక మహిళల భద్రతను గాలికి వదిలేశారని మండిపడ్డారు. రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియో ఇచ్చి చేతులు దులుపుకుంటున్న ప్రభుత్వం నిందితునిపై కఠిన చర్యలు తక్షణం తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితులను అరెస్టు చేసి జైలులో పెట్టి రాజభోగాలు కల్పించకుండా తప్పు చేసిన మరుసటి రోజే శిక్షపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ గర్ల్స్ కో- కన్వీనర్ శ్రావణి, వనిత, శరవరాలు, మల్లికా, వాణిశ్రీ, మౌనిక , ఇక్బల్, అనిల్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

చదువులమ్మ చెంతనే సుర

వరదయ్యపాళెం : మండలంలోని వీకేఆర్‌వై కాలనీ కూడలిలో 105 నంబర్ మద్యం దుకాణం ప్రభుత్వ పాఠశాలకు సమీపంలో ఉండడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం విధించిన నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణం ఏర్పాటు చేయడమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు దుకాణం వ్యవహారంపై చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ఎక్సైజ్ పోలీసులు తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రిమాండ్ ఖైదీ అరెస్టు



రిమాండ్ ఖైదీ ఇస్లాం అరెస్టు చూపుతున్న పోలీసులు

తడ: లైంగికదాడి కేసులో అసోం జైలులో శిక్ష అనుభవిస్తున్న రిమాండ్ ఖైదీ సయ్యద్ జియారుల్ ఇస్లాంను సూళ్లూరుపేట పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. అసోం రాష్ట్రంలోని మోరిగాన్ జిల్లా జైలులో శిక్ష అనుభవిస్తున్న ఐదుగురు నిందితులు అక్టోబర్ 11వ తేదీ జైలు నుంచి తప్పించుకుని, పారిపోయారు. ఇందులో లైంగికదాడి కేసులో నిందితుడిగా ఉన్న అసోం నగరానికి చెందిన సయ్యద్ జియారుల్ ఇస్లాం కూడా ఉన్నాడు. ఇతను అక్కడి నుంచి పారిపోయి తడ మండలం, మాంబట్టు సెజ్ పరిధిలోని పరిశ్రమలో పని చేస్తున్న తన మిత్రుల వద్దకు చేరుకుని తల దాచుకున్నట్టు తిరుపతి ఎస్పీ కార్యాలయానికి సమాచారం అందింది. ఆ మేరకు వచ్చి ఆదేశాలతో సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు వల పన్ని మాంబట్టు సెజ్ పరిధిలో తిరుగుతున్న రిమాండ్ ఖైదీని అరెస్టు చేశారు.

నవంబర్‌లో మహనీయుల తిరు నక్షత్రోత్సవాలు

తిరుమల: శ్రీవారికి ఏడాది పొడవునా వివిధ ఉత్సవాలు నిర్వహించడమే కాకుండా, శ్రీవారి పరమ భక్తుల తిరు నక్షత్రోత్సవాలు కూడా టీటీడీ ఏటా ఘనంగా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా నవంబర్ 3న ఆదివారం తిరుమల నంబి శాత్తుమొర వైభవంగా నిర్వహించారు. శ్రీ వైష్ణవ భక్తుడైన తిరుమల నంబి తిరుమలలో తీర్థ కైంకర్యాన్ని ప్రారంభించారు. శ్రీవారి ఆలయం దక్షిణ మాడ వీధిలో శ్రీ తిరుమల నంబి ఆలయం కూడా ఉంది. శ్రీ రామానుజాచార్యుల అంశతో జన్మించిన శ్రీ మనవాళ మహాముని శాత్తుమొర నవంబరు 6న నిర్వహించనున్నారు. 9న అత్రి మహర్షి, శ్రీ పిళ్లై లోకాచార్య, శ్రీ పోయిగై ఆళ్వార్, శ్రీ భూదత్తాళ్వార్ల తిరు నక్షత్రోత్సవాలతో పాటు శ్రీ వేదాంత దేశికాచార్య శాత్తుమొర, 10న శ్రీ పేయాళ్వార్ వర్ష తిరు నక్షత్రం, 11న శ్రీ యాజ్ఞవల్క్య జయంతి నిర్వహించనున్నారు.

తిరుమలలో కూలిన వృక్షం

తిరుమల: రాంబగీచా అతిథి గృహం వద్ద ఓ భారీ వృక్షం కార్లపై కూలిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. తిరుమలలోని రాంబగీచా అతిథి గృహానికి వెళ్లే దారిలో ఓ భారీ వృక్షం అమాంతంగా విరిగి, రెండు కార్లపై పడింది. దీంతో ఈ ఘటనలో రెండు కార్లు ధ్వంసం అయ్యాయి. ఈ ఘటన సమయంలో భక్తులు ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వెంటనే తిరుమలలోని ఫారెస్ట్ అధికారులు నేలకొరిగిన చెట్లను సకాలంలో తొలగించారు.

■ "జూలై.. తిరుపతి జిల్లా నాయుడుపేట పరిధిలోని దొరవారిసత్రంలో ఎనిమిదేళ్ల బాలికను ఈనెల 17న కిడ్నాప్ చేశారు. ఇంట్లో ఆడుకుంటున్న బాలికను తీసుకెళ్లి, బాలికపై అఘాయిత్యానికి పాల్పడి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో నిందితుడు ఎవరో కాదు.. బాధిత బాలిక తండ్రికి స్నేహితుడే. తండ్రి స్నేహితుడు కావడంతో నమ్మి వెళ్లినందుకు ఈ దురాగతానికి పాల్పడ్డాడు."

■ "జూలై.. చిత్తూరులో తన వద్ద పనిచేసే మైనర్ బాలికపై ఆర్ఎంపీ వైద్యుడు అఘాయిత్యానికి పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల విచారణలో అతను పలుమార్లు బాలికపై లైంగికదాడికి పాల్పడడంతో ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆర్ఎంపీ వైద్యుడ్ని పోలీసులు అరెస్టు చేసినా, జరగాల్సిన నష్టం జరిగిపోయింది."

■ "అక్టోబర్.. పుంగనూరులో ఆరేళ్ల చిన్నారి తప్పిపోయింది. తొలుత మిస్సింగ్ నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తు పూర్తి చేసేలోపు పాప శవమై తేలింది. ఆర్థిక లావాదేవీలు ఈ హత్యకు కారణంగా చెబుతున్నా, పోయిన ప్రాణం తిరిగి రాలేదు."

■ "నవంబర్.. వడమాలపేటలో మూడేళ్ల చిన్నారిని నమ్మించి వెంట తీసుకెళ్లిన రాక్షసుడు, తినడానికి అవీ ఇవీ కొనిచ్చి దారుణానికి పాల్పడ్డాడు. విషయం బయట తెలిసిపోతుందని చిన్న బిడ్డ గొంతునులిమి చంపేశాడు."

పసి మొగ్గలపై మృగాళ్ల పంజా

అమ్మ లాలన తప్ప ఏమీ ఎరుగని పసి మొగ్గలను నలిపేస్తున్నారు. చిరుతిండి కోసం చేయిచాచే కూనలపై పంజా విసురుతున్నారు. తెలిసిన వాళ్లే తోడేళ్లుగా మారి చిన్నారులను చిదిమేస్తున్నారు. అండగా ఉంటారనుకుంటే అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. ఏ మాత్రం లోకజ్ఞానం లేని బాలికలను ఎంచుకుని కాటేస్తున్నారు. తనకు ఏం జరుగుతోందో కూడా తెలుసుకోలేని అమాయకపు చూపుల్లో నెత్తురు పారిస్తున్నారు. గంజాయి మత్తులో రాక్షసులుగా మారి బాలికల రక్తం తాగుతున్నారు. కామాంధుల పైశాచికత్వానికి పసికందులు బలైపోతున్నారు. అమ్మతనాన్ని బాల్యంలోనే పాతిపెట్టేస్తున్న ఈ సమాజానికి కనువిప్పు కలిగించేదెవరు?

- చిన్నారులను చిదిమేస్తున్న కర్కోటకులు
- పిల్లలపై పెరుగుతున్న అఘాయిత్యాలు
- పిల్లల సంరక్షణపై తల్లిదండ్రుల్లో ఆందోళన



తిరుపతి క్రైమ్: తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో కొన్ని నెలలుగా పసి పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు తల్లిదండ్రుల్ని ఆందోళనలో పడేస్తున్నాయి. అసలు పిల్లల్ని ఇంటి నుంచి బయటకు పంపాలంటే భయపడిపోయే పరిస్థితులు నెలకొంటున్నాయి. నవమాసాలు మోసి, కన్నతల్లి ఆవేదన.. అల్లారు ముద్దుగా చూసుకున్న తండ్రి ప్రేమ రెండింటినీ సమాధి చేసే రాక్షసులు మన చుట్టూ చేరి, మనతోనే తిరుగుతూ పిల్లలపై ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. చేసిన తప్పు రుజువైతే న్యాయస్థానం శిక్ష విధిస్తుంది. కాకుంటే నిందితుడు దర్జాగా బయటకు వచ్చేస్తాడు. కానీ పోయిన ప్రాణం మాత్రం ఎప్పటికీ రాదు.

తెలిసిన వాళ్లే తోడేళ్లు

పిల్లలపై జరుగుతున్న లైంగిక దాడులు, హత్యల్లాంటి కేసుల్లో నిందితులు ఎక్కడో ఆకాశం నుంచి ఊడి పడడంలేదన్నది తల్లిదండ్రులు గుర్తించుకోవాల్సిన విషయం. 90 శాతం కేసుల్లో నేరాలకు పాల్పడింది బిడ్డను కోల్పోయిన తల్లిదండ్రులకు స్నేహితులు, ఎదురింటి వాళ్లు, పక్కింటి వాళ్లు కావడం అందరినీ ఆలోజింపచేస్తోంది.

పిల్లలపై లైంగిక దాడులకు పాల్పడే సంఘటనల్లో నిందితులుగా ఉన్నవారు, బాధితులకు బాగా పరిచయమైన వాళ్లు, దగ్గరివాళ్లుగా ఉంటున్నారు. మనతో ఉన్న ఆర్థిక లావాదేవీలు, చిన్న పాటి తగాదాలను పిల్లలపై చూపించి, కర్కశంగా ప్రవర్తిస్తున్నారు. కొన్ని ఘటనల్లో తల్లిదండ్రులతో ఎలాంటి తగాదాలు లేకున్నా, పిల్లలపై కన్నేసి మాయమాటలు చెప్పో, లేనిపోనివి ఆశ చూపించో అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. తరచూ ఇంటికి వస్తూపోతూ ఉండడం, పిల్లల్ని వక్రబుద్ధితో తాకుతూ ఆనందించడం చేస్తుంటారు. పిల్లలు ఏది ఇష్టపడుతారో, దాన్ని వాళ్లకు ఆశ చూపించి క్రమంగా బయటకు తీసుకెళ్లడం చేస్తుంటారు. తల్లిదండ్రులు కూడా ఆ మృగాలపై నమ్మకం పెంచుకున్నాక, పిల్లల్ని ఒంటరిగా ఎవరూ లేని సమయం చూసుకుని క్రూరత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. అసలు బయటి వ్యక్తులకు పిల్లలతో ఏం పని..? అని ఒక్క ప్రశ్న వేసుకోవడంతో సగం కాపాడుకున్నట్టే అవుతుంది. అంతటితో ఆగకుండా పిల్లలకు ఏది మంచి-చెడు అని వాళ్ల స్థాయిలో చిన్న పాటి విషయాలు కచ్చితంగా చెప్పాలి.

మత్తుకు బానిసలై

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పట్టణ, గ్రామీణ మండలాల్లో యువకులు అత్యధికంగా గంజాయి మత్తు బారిన పడుతున్నారు. మద్యం, ఇతర మత్తు పదార్థాలకన్నా గంజాయి ప్రభావం అత్యధికంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. అందువల్ల పోలీసులు తగు చర్యలు తీసుకొని విక్రయాలు సమూలంగా కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. రెండేళ్ల కిందట నగరి పట్టణంలోని రామాపురం క్రషర్ గుంటలో ఐదుగురు యువకులు మద్యం మత్తులో ఓ వ్యక్తిని అత్యంత పాశవికంగా హత్య చేశారు. నగరి మండల పరిధిలోని తడుకుపేట సమీపంలో 20 రోజుల క్రితం గంజాయి మత్తులో ఉన్న యువకులు ఓ దంపతులకు కత్తి చూపి బెదిరించి నగదును లాక్కెళ్లారు. అదే మండలంలోని నాగరాజుకుప్పం వద్ద గంజాయి విక్రయిస్తున్న తమిళనాడుకు చెందిన ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు.

అందుబాటులో జీపీఎస్

పిల్లల్ని కాపాడుకునే విషయంలో సాంకేతిక పరిజ్ఞానం చాలానే సాయపడుతోంది. ఇపుడు రూ.వెయ్యిలోపే ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్స్‌లో జీపీఎస్ (గ్లోబల్ పొజిషన్ సిస్టమ్) పరికరాలు దొరుకుతున్నాయి. పిల్లల చేతికి పెట్టే వాచీల్లో, మెడలో వేసుకునే గొలుసులు, కాళ్లకు వేసుకునే చెప్పులు ఇలా ఎక్కడైనా ఇమిడిపోయే జీపీఎస్ ట్రాకర్ పరికరాలు చాలానే అందుబాటులో ఉన్నాయి. ఇవి ఎలా పనిచేస్తాయి? ఎందుకు ఇస్తున్నామనే విషయం పిల్లలకు స్పష్టంగా చెప్పడం వల్ల ఇలాంటి దారుణాల నుంచి రక్షించుకునే అవకాశం ఉంది. తల్లిదండ్రులు ఇంటికి రావడం ఆలస్యమైనా, పిల్లలు స్కూల్ నుంచి ఇంటికి వచ్చే సమయంలో పేరెంట్స్ లేకున్నా, పిల్లల్ని ఎవరైనా బయటకు తీసుకెళ్లినా ఎక్కడున్నారనే విషయాన్ని జీపీఎస్ ద్వారా పసిగట్టేయచ్చు. ఇందులోనే ఫెన్సింగ్ ఆప్షన్ ఉన్న పరికరాలు కూడా ఉన్నాయి. మన ఇంటి నుంచి వంద మీటర్ల పరిధిని ఎంపిక చేసుకోవడం, దాన్ని పిల్లలు దాటితే అలారం మోగేలా చేయడం, అత్యవసర పరిస్థితుల్లో అలారం మోగించడం ఇలా పలు రకాల పరికరాలు పిల్లల్ని కాపాడే అవకాశం ఉంటుంది.

తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి



ఆడ పిల్లల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి. ఇప్పుడు పరిస్థితి చూస్తుంటే ఎవరినీ నమ్మడానికి వీలు లేదు. చాలా మంది యువకులు మద్యానికి బానిసలై, విచ్చలవిడిగా తిరుగుతున్నారు. వారు ఏమి చేస్తున్నారో వారికే తెలియడం లేదు. ఆడ పిల్లల తల్లిదండ్రులు ఇలాంటి యువకులు ఉన్న చోటకు పంపకూడదు.

– రాజేశ్వరి, బట్టికండ్రిగ, వడమాలపేట

ప్రత్యేక చట్టం తీసుకురావాలి



మత్తు పదార్థాలపై ప్రత్యేక చట్టం తీసుకురావాలి. గంజాయి, మద్యంపై ప్రత్యేక దృష్టి పెడితే ఇలాంటి సంఘటన జరగకుండా ఉంటుంది. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టి, చెడు అలవాటుకు దూరంగా ఉండేలా చూసుకోవాలి. మత్తు పదార్థాల నివారణపై యువతకు అవగాహన కల్పించాలి.

– జయలక్ష్మి, ఏఎం పురం

దిశ పట్టం తీసుకురావాలి

రాష్ట్రంలో ఆడవారిపై లైంగిక దాడి నియంత్రణకు ప్రభుత్వం దిశ చట్టాన్ని అమలు చేయాలి. అప్పుడే ఆడవారిపై దాడి చేయాలన్న ఆలోచన రాదు. ఇది రాజకీయ కోణంలో చూడకూడదు. మానవ కోణంలో ఆలోచించి, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి. మత్తు పదార్థాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

– మునివేలు, ఎంపీపీ, పుత్తూరు

బోర్డులు పీకేశారు!



బోర్డును తొలగించి, అక్రమ నిర్మాణాలు చేపడుతున్న అధికార పార్టీ నాయకులు

చంద్రగిరి: ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులను టీడీపీ నాయకులు పీకి, పడేసి, యథేచ్ఛగా ఆక్రమణలకు పూనుకుంటున్నారు. చంద్రగిరి పంచాయతీ ఇందిరమ్మ కాలనీలోని గుట్టలు, ఖాళీ ప్లాట్లను అధికార పార్టీ నాయకులు దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్న ఘటనపై ఆదివారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. అంతకుముందే శనివారం రెవెన్యూ అధికారులు ఆక్రమణలకు గురైన ప్రాంతాలను పరిశీలించి, మూడు చోట్ల ప్రభుత్వ భూములని బోర్డులను ఏర్పాటు చేశారు. అయితే ఆదివారం గుట్టలను చదును చేసి ఆక్రమించిన ప్రాంతం మినహా మిగిలిన రెండు ప్రాంతాల్లోని బోర్డులను టీడీపీ నాయకులు తొలగించారు. అపై వారి అక్రమ నిర్మాణాలను పునఃప్రారంభించారు. దీనిపై తహసీల్దార్ సుబ్బరామయ్యను వివరణ కోరగా.. ప్రభుత్వ భూమి ఆక్రమణలకు సంబంధించి ఇందిరమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన బోర్డులను తొలగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. దీనిపై విచారణ జరిపి, ఎలాంటి వారినైనా ఉపేక్షించబోమని చెప్పారు. చట్టపరంగా వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ఎమ్మెల్యే ఎక్కడ?

- మంత్రి పర్యటనలో కనిపించని ఆరణి
- ఎమ్మెల్యే కోసం ఆరా తీసిన మంత్రి

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఎమ్మెల్యే ఎక్కడ? అని మంత్రి నాదేండ్ల జనసేనులను ఆరా తీశారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో జనసేన పార్టీకి చెందిన ఏకైక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు. అదే జనసేన పార్టీలో నంబర్ 2గా ఉన్న పౌరసరఫరాల మంత్రి, పీఏసీ చైర్మెన్ నాదేండ్ల మనోహర్ రెండు రోజుల పాటు తిరుపతి జిల్లాలో పర్యటించారు. తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మంత్రి పర్యటనకు డుమ్మా కొట్టారు. సూపర్ సిక్స్ పథకాల్లోని దీపం-2 పథకం కార్యక్రమాన్ని శనివారం జిల్లా కేంద్రమైన తిరుపతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పౌరసరఫరాల శాఖా మంత్రి నాదేండ్ల మనోహర్ హాజరయ్యారు. ప్రభుత్వ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే హాజరు కావాల్సిఉంది. అయినా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరు కాలేదు. అలాగే మంత్రి ఆదివారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. ఆ సమయంలోనూ స్థానిక ఎమ్మెల్యే లేరు. మంత్రి తిరుగు ప్రయాణంలో రేణిగుంట విమానాశ్రయంలో నాదేండ్ల మనోహర్ జనసేన జిల్లా నాయకులతో సమావేశం అయ్యారు. జిల్లా నాయకులంతా హాజరైనా ఒక్కగానొక్క జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరు కాకపోవడంతో మంత్రి నాదేండ్ల మనోహర్ ఆరా తీశారు.

ఆటవిడుపు కోసం వచ్చి..

- మహిళ మృతి
- మరో మహిళకు తీవ్ర గాయాలు





ప్రమాదంతో మృతి చెందిన లోకేశ్వరి, విరిగిపోయిన క్రాస్ వీల్

చంద్రగిరి(తిరుచానూరు): సరదాగా గడపాలని ఆటవిడుపు కోసం వచ్చిన మహిళా ప్రమాదవశాత్తు మృత్యువాత పడగా, మరో మహిళా తీవ్ర గాయాలపాలైన ఘటన తిరుచానూరు శిల్పారామంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... తిరుపతి అర్బన్ మండలం సుబ్బారెడ్డి నగర్‌కు చెందిన లోకేశ్వరి(22) తన స్నేహితురాలు గౌతమి అలియాస్ పండుతో కలసి ఆటవిడుపు కోసం తిరుచానూరు సమీపంలోని శిల్పారామానికి చేరుకుంది. సుమారు గంట పాటు శిల్పారామంలో పలు ప్రాంతాలను సందర్శించి, ప్రశాంత వాతావరణంలో ఆహ్లాదకరంగా గడిపారు. ఈ క్రమంలో అక్కడే ఏర్పాటు చేసిన క్రాస్‌వీల్ ఎక్కారు. ఇద్దరు మహిళలు కూర్చుని తి రుగుతుండగా క్రాస్‌వీల్ ఉన్నట్టుండి విరిగి పడిపోయింది. ఈ ప్రమాదంలో లోకేశ్వరి, ఆమె స్నేహితురాలు గౌతమి గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే నిర్వాహకులు తేరుకుని, 108కు సమాచారం అందించారు. అనంతరం క్షతగాత్రులను 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ వైద్య పరీక్షలను నిర్వహించిన వైద్యులు అప్పటికే లోకేశ్వరి మృతి చెందినట్లు నిర్ధారించగా, గౌతమి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం గౌతమిని తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పూతలపట్టులో మరో చైన్ స్నాచింగ్

పూతలపట్టు: మండలంలో ఆదివారం చైన్ స్నాచింగ్ సంఘటన చోటుచేసుకుంది. సీఐ కృష్ణమోహన్ కథనం మేరకు మండలంలోని తిమ్మిరెడ్డిపల్లె జగనన్న కాలనీకి చెందిన భారతి ఆదివారం ఉదయం తన ఇంటి పనుల్లో ఉండగా, ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె చేతులను వెనుకకు గట్టిగా పట్టుకొని అరిచి గోల చేస్తే చంపేస్తానని బెదిరించి ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కొని వెళ్లిపోయారు. అనంతరం బాధితురాలు పోలీస్ స్టేషన్ ఆశ్రయించగా, పోలీసులు కేసు నమోదు చేశారు. గత నెల 26న జరిగిన చైన్‌స్నాచింగ్ ఘటనలో ఐరాల మండలానికి చెందిన ప్రమీల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిన విషయం తెలిసిందే.

ఘనంగా గణపతి హోమం

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలో ఆదివా రం శ్రీగణపతి హోమాన్ని భక్తిప్రపత్తులతో చేశారు. కార్తీక మాసం పురస్కరించుకుని ఆలయంలో నెల పాటు హోమ మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ . ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాలలో వినాయకస్వామి ప్రతిమకు విశేష అలంకరణ చేశారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు వివిధ కార్యక్రమాలను అర్చకబృందం శాస్త్రోక్తంగా నిర్వహించింది. వినాయకుడికి ప్రీతి పాత్రమైన కుడుములు, నెయ్యి, అన్నం, అటుకులు, బెల్లం, అరటిపండ్లు ఇత్యాది అష్టద్రవ్యాలతో హోమం చేశారు. 16 నామాలతో గణపతిని స్తుతించారు. తర్వాత సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు జపం, హోమం, శ్రీగణపతి సహస్ర నామార్చన, నివేదన, విశేష దీపారాధన, మంత్రపుష్పం, హారతి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ దేవేంద్రబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఇజ్రాయిల్ మృతదేహం

తిరుపతి రూరల్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో అక్కడికి అక్కడే మృతి చెందిన ఘటన శనివారం రాత్రి ఓటేరు వద్ద చోటుచేసుకుంది. తిరుపతి రూరల్ ఎస్ఐ ఎస్కే మూర్తి కథనం మేరకు.. ప్రకాశం జిల్లా మద్రిమూడి గ్రామానికి చెందిన ఇజ్రాయిల్(45) కుటుంబంతో తిరుపతికి వలస వచ్చి మేస్త్రీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. శనివారం రాత్రి ఓటేరు వద్ద జాతీయ రహదారిని దాటుతుండగా గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో అక్కడికి అక్కడే మృతి చెందాడు. మృతుని భార్య సరోజ ఆదివారం తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఈ మేరకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మూర్తి తెలిపారు.

ఐచర్‌ను ఢీకొన్న ఆటో.. డ్రైవర్ మృతి



మృతి చెందిన మనోహర్

చంద్రగిరి(తిరుచానూరు): ఐచర్ వాహనాన్ని ఆటో ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన ఆదివారం పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలోని పద్మశాలి భవనం సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బీఎన్ కండ్రిగ మండలం అలత్తూరు గ్రామానికి చెందిన మనోహర్(45) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. ఆదివారం మంత్రి పర్యటన ఉన్న నేపథ్యంలో ఆదివారం తిరుచానూరు పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఈ క్రమంలో గాజులమండ్యం నుంచి తనపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో మనోహర్ రాంగ్‌రూట్‌లో ఆటోను నడుపుకుంటూ వెళ్లాడు. ఈ నేపథ్యంలో తనపల్లి మార్గం నుంచి వాహనాలను అనుమతించడంతో ఎదురుగా వస్తున్న ఐచర్ వాహనాన్ని ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో మనోహర్ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని హుటాహుటిన తిరుపతి రుయాకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మనోహర్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా వసతి.. పట్టదెవరికీ!

ప్రజా సమస్యల పరిష్కార వేదిక.. ఈ పేరులోనే ఉంది.. సామాన్య, మధ్యతరగతి, పేదల సమస్యలను పరిష్కరించడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమం అని.. అయితే తమ అవస్థలను విన్నవించుకోవడానికి వచ్చిన వారికి వెతలు తప్పడం లేదు. తాగునీరు, కుర్చీలు, చదువురానికి వారికి అర్జీలు రాసిచ్చే వారు, రవాణా తదితర వసతులేమీ లేవు. ఈ విషయం పట్టించుకోవాల్సిన ప్రభుత్వం, అధికారులు నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా అర్జీదారులు ఇక్కట్లు పడుతున్నారు.



కింద కూర్చుని అర్జీలు రాసుకుంటున్న అర్జీదారులు

- అంతా గందరగోళం
- క్యూ పద్ధతి లేదు

తిరుపతి అర్బన్: జిల్లా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌డే కార్యక్రమంలో మెరుగైన వసతులు కల్పించడం లేదు. దీంతో సామాన్య, మధ్య తరగతి, పేదలకు కష్టాలు తప్పడం లేదు. జిల్లాలో 34 మండలాలున్నాయి. వివిధ సమస్యలపై జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారికి సకల సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అయితే తూతూ మంత్రంగా గ్రీవెన్స్‌ను ముగిస్తున్నారనే విమర్శలు పెద్ద ఎత్తునే వినిపిస్తున్నాయి. ప్రధానంగా కలెక్టరేట్ తిరుపతి నగరానికి దూరంగా తిరుచానూరు సమీపంలో ఉంది. తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నుంచి కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌కు వెళ్లాలంటే ఆటోకు రూ.200 నుంచి రూ. 250 ఇవ్వాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. దీంతో గత సర్కార్‌లో ప్రతి సోమవారం గ్రీవెన్స్ సందర్భంగా ఓ ఆర్టీసీ సర్వీసును ఏర్పాటు చేసేవారు. ఆ సర్వీస్ గ్రీవెన్స్ రోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ఇలా మూడు సార్లు బస్టాండ్‌కు తిప్పేవారు. దీంతో రూ.10కే బస్టాండ్‌కు చేరుకునే సౌకర్యం ఉండేది. అయితే ప్రస్తుతం బస్టాండ్ నుంచి గ్రీవెన్స్ రోజు నడిచే ఆర్టీసీ బస్సు సర్వీసులను తొలగించారు. మరోవైపు గ్రీవెన్స్ రోజు తాగునీటి వసతులు కల్పించడం లేదు. ప్రధానంగా గ్రీవెన్స్ రోజు అవసరం అయిన మేరకు కుర్చీలను ఏర్పాటు చేయడం లేదు. దీంతో అర్జీదారులు కిందే కూర్చోవాల్సి వస్తోంది. మరోవైపు అర్జీలు రాయడానికి తెలియని వారి కోసం గత ప్రభుత్వ హయాంలో అవసరం అయిన మేరకు వీఆర్వోలను గ్రీవెన్స్ రోజు ఏర్పాటు చేసేవారు. వారు అర్జీలను రాసి ఇచ్చేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవు. గ్రీవెన్స్‌కు వచ్చే ప్రతి అర్జీకి ముందుగా టోకెన్ నంబర్ తీసుకోవాల్సి ఉంది. ఈ సందర్భంగా క్యూపద్ధతిని పాటించడం లేదు. దీంతో ఎవరు ముందు వచ్చారు..ఎవరూ తర్వాత వచ్చారన్న విషయం తెలియడం లేదు. ప్రధానంగా ఆ గుంపుల్లో వృద్ధులు నానా తంటాలు పడుతున్నారు. అయినా పట్టించుకునే దిక్కులేకుండా పోతుంది. తీరా టోకెన్ తీసుకున్న తర్వాత కలెక్టర్, జేసీ, డీఆర్వో తదితర ఉన్నతాధికారులను కలవడానికి గంటల కొద్ది వేచి ఉండాల్సి వస్తోంది. ముందు వచ్చిన వారు కాకుండా వెనుక వచ్చిన వారు ఎంచెక్కా వెళ్లిపోతున్నారు. వృద్ధులు ముందుగా ఉదయం 10.30 గంటలకు వచ్చినా ఉన్నతాధికారులను కలవడానికి మధ్యాహ్నం 1.30 గంటలు అవుతుంది. దీంతో మూడు గంటల పాటు వేచి ఉండడానికి వారంతా నానా తిప్పలు పడుతున్నారు. మొత్తంగా గ్రీవెన్స్‌ను ఓ క్రమపద్ధతిలో నిర్వహిస్తే బాగుంటుందని, ప్రధానంగా వృద్ధులకు ఇక్కట్లు ఉండవని అంతా చెబుతున్నారు. అధికారులు ఈ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.